# ✻ కుముద్వతి ✻

(కథానిక)

నేను చిట్టగాంగులో సైనిక జీవితం సాగిస్తూన్న రోజులవి. ఆవేళ మనసు ఆందోళన పడుతూంది. ఏదోవొక అద్భుతమైన కార్యం జరుగనున్నదనిపించి, అకారణంగా హృదయంలో అశాంతి బయలుదేరింది. ప్రకృతి కూడా యెటు చూసినా యేదో ఆశపెడుతూన్నట్టు, అది నే నందుకో లేకపోవడం వల్ల నన్ను హేళన చేస్తూన్నట్టనిపించింది. నా పిరికితనానికి మొదట సిగ్గువచ్చింది. తరవాత కోపం వచ్చి, పిడికిళ్లు బిగించి, ఖాటుతో నేలని తన్ని లేచేను. సూర్యాస్తమయానికి యింకా వొక గంట పైగా వేళవుంది. ఒంటరిగా బయలుదేరేను.

ఆవూళ్లో నేను రెండేళ్లనుండీ వున్నప్పటికీ యెప్పటికప్పుడే వూరంతా యేదో యింద్రజాల నిషిక్తమైనట్టు గోచరించేది. గాలిలో తేలుతున్నట్టుండేది.

అక్కడ సుమారు యాభైవేల సైనికులుండేవారు. వారు విరామకాలంలో సైతం రోడ్ల మీద క్రమశిక్షణ విధానం ప్రకారం నడిచేవారు. వాళ్ళు నడుస్తూంటే ఆ మట్టికింద యే ఐంద్రజాలికుడో దాగి మంత్రపూర్వకంగా మీటలు నొక్కుతున్నాడేమో, ఆ ప్రకారమే వీళ్ళు నడుస్తున్నారేమో అనిపించింది. ఈ కదిలే ఆలివ్ చెట్లను చూసి తల దిమ్మెక్కి, యేదైనా ఏకాంతప్రదేశానికి వెళ్లాలనిపించింది. అయినా యేదో అద్భుతవిశేషం జరగక తీరదనిపించింది, హృదయంలో.

వంగదేశపు తూర్పు సరిహద్దుల వద్ద కొండ జాతి వారిని 'మాగ్' లంటారు. వాళ్ళు నివసించే కొండలు చిట్టగాంగుకు మిక్కిలి సమీపంలోనే వున్నాయి. 'మాగ్'లు మూర్ఖులైనా ప్రమాదకరమైనవారు కారు. వాళ్లకి అపాయం తలపెట్టనివారిని పూజిస్తారు. అనుమానం తగిలితే యేగేసి తెగనరుకుతారు. వాళ్లని చూడాలని కూడా కుతూహలం చాలా కాలం నుంచీ వుంది. అంచేత అటు బయల్దేరేను.

ఆకొండ లెక్కుతూంటే సాయంత్రపు స్వచ్ఛ సూర్యకాంతిలో దూరంగా కర్ణఫులీ నదీ జలాలు పాదరసంవలె మిలమిల మెరుస్తున్నాయి. నీరెండకి కొండ వుపరిభాగం భూదేవి కిరీటంలో హీరమణి పొదిగినట్టు తళుకులు తుంకుతూంది. పనసచెట్ల ఆకులలోంచి 'కట్టల్ ఫాగో' అని పిట్ట అరుస్తూంది. ఇది కథలో చిత్ర కథ. ఒకప్పుడు రెండు పిట్టలు, అక్క, తమ్ముడు వుండేవట. తమ్ముడికి పనసతొనలంటే మహాయిష్టం. అక్కకి అవి తినిపించడం యిష్టం. అంచేత ప్రతి యేడూ పనసకాయల కాలంలో అక్కపిట్ట 'కట్టల్! ఫాగో!' (పనసా! పండవే!) అని అరిచేది. పాపం వొకయేడు పనస యింక పండుతుందనగా తమ్ముడుపిట్ట చచ్చిపోయిందట. అక్కపిట్ట మతిపోయి, 'కట్టల్! ఫాగో!' అని యేడవడం ప్రారంభించింది. కథ నిజమో కాదో గాని ఆ అరుపు మాత్రం మిక్కిలి జాలికరంగా వుంటుంది.

ఈ ప్రకృతి రమణీయంలో మునిగిపోయిన నేను సూర్యాస్తమయం, చంద్రోదయం రెండూ గమనించలేదు.

లేత వెన్నెల నిమ్నోన్నతాల తారతమ్యం తగ్గించి నన్ను మోసగిస్తూంది. ముందేదో జరిగి తీరుతుందని ఆవేశంలో వున్న నేను వొంటరితనాన్ని మరిచిపోయేను. సిగరెట్టుపొగ వొదులుతూ, ఆ ఫోవృక్షాలతో ముందుకు సాగిపోతూ మైమరచి వున్న నాకు హఠాత్తుగా వొక మూలుగు వినిపించింది. కుడి ప్రక్కకు చూసేను. అడివి తుప్పల పందిరిక్రింద గదివలె తొలిచివున్న బండరాయి కనుపించింది. దానిలోనికి చంద్ర

అంగర వెంకట కృష్ణారావు

కిరణాలు సూటిగా పోతున్నాయి. మూలుగు అటువైపునించే వచ్చింది. నేనటు నడిచేను.

దానిలో దట్టంగా అల్లుకున్న సాలెపురుగు పట్టు వెన్నెలలో ధగధగ మెరుస్తూంది. రెండు మూడు గజాలదూరంవరకూ వచ్చి చూసేను కాని తిరిగి నాకేమీ వినిపించలేదు, కనుపించలేదు. అది నా భ్రాంతి అనుకొని వెళిపోబోతూంటే మళ్లీ ఆ మూలుగు వినిపించింది. వెంటనే 'నాయనా! ఇలా దగ్గరగావచ్చి కూచో' అన్నట్టయింది. అది పురుష కంఠం. నేను నిర్ఘాంతపోయేను. సాలెపట్టులోకి తేరిపారి చూడగా నాకో మానవాకారం గోచరించింది. అది చేరగిలబడి కూర్చుని, లేవడానికి శక్తిలేని నీరస స్థితిలోవున్న పురుషాకారం. నేనొక లిప్తకాలం ఆలోచించేను మనిషా కాదా అని!

'ఎవరు నువ్వు?'

'భయపడకు నాయినా! నే నెవరనో తరవాత చెపుతాను. కాని ముందు నా కొక సహాయం చెయ్యి-చేస్తావా?'

'వీలయితే'

'ఇలా కూచో'

నేను తిరిగి సిగరెట్టు ముట్టించేను. ఆ నూతన వ్యక్తికి ఒకటి యివ్వబోతే కాల్చనన్నాడు. చల్లగాలికి సాలెపట్టు ఆడుతూంటే అతనూ ఆడుతున్నాడు, నీటిమీద బుట్టవలె. అతడు మనిషో కాదో అని నాశంక!

'నాయినా! ఒక్కపాట పాడుదూ. నీకు విశ్వకవి వ్రాసిన 'ప్రేమేర్ సమాధి తీర్' అనే పాటవచ్చునా అది పాడు నాయినా అన్నాడు అతి దీనంగా.

నాకు పాటలు వచ్చుగాని పాడితే వినే వాళ్లకి యాతనగా వుంటుందని చెప్పేను. కాని అతడు అదే బాగుంటుంది పాడమన్నాడు. నేను గొంతుక సవరించుకుని పాట ఆరంభించేను. నామట్టుకునాకే గాడిద అరిచినట్టుంది. కాని పాట ఆరంభించగానే నా శ్రోత లేచి సాలెపట్టు చించి వైచి పైకి వచ్చి నా కెదురుగా కూచున్నాడు. నవ్వు ముఖంతో, బుఱ్ఱతిప్పుతూ, కన్నీళ్లు కారుస్తూ, 'తాజ్ మొహాలే' అన్నప్పుడు వెక్కి వెక్కి యేడవ జొచ్చాడు. ఈ పాటకీ యీ వ్యక్తికీ యేమి సంబంధమో అనిపించింది. అసలతడు మనిషేనా?

పాట ముగిసింది. అతడు బహుఖుషీ అయిపోయేడు! అదే సమయం, యిక కథ లాగాలి అని ఒక సిగరెట్టుతీసి యిచ్చేను. అతడు సంతోషంగా అందుకుని నోట్లో పెట్టుకొన్నాడు. నిప్పు అంటించకుండా హఠాత్తుగా అది వెలిగింది! నా గుండెలు గడగడ లాడేయి. కాని మేకపోతు గాంభీర్యం వహించాను.

'పాట బాగుందా?'

'పాట! ఆ పాటకీ నాకూ జన్మాంతర సంబంధం నాయనా; నువ్వు నిజంగా నాకు మహోపకారం చేసేవు. పది సంవత్సరాల తరవాత తిరిగి నేడు నా హృదయం తేలికపడింది. చూశావా నా కెంత బలం వచ్చిందో! ఇవాళ నా కుముద్వతిని చూసినట్టుంది' అన్నాడు దట్టంగా పొగ వదలుతూ.

'కుముద్వతి?'

'ఔను. అదే! నా ప్రేయసి! నీకా కథంతా చెపుతాను. కాని ముందుగా నిన్ను కోరేదేమంటే నువ్వేమీ భయపడకు.'

'నాకు భయం అంటే యేమిటో తెలీదు'

'సరే. నేను మనిషిని కాను. జీవిత ప్రపంచం నుండి కాందిశీకుడిని. అంటే మీ మానవుల భాషలో దెయ్యాన్ని.'

నాకు బుఱ్ఱలో రైళ్లు గుద్దుకొన్నట్టయింది. జడిసి ప్రయోజనం లేదని తెలుసు. అంచేత ధైర్యం వహించేను.

అతడన్నాడు: 'కాని నాయనా! నువ్వేమీ భయపడకు. నిన్ను బాధపెట్టను. నాకథ మాత్రం విను.'

నాకు నిజంగా భయం పోయినట్టయింది. జరగబోతుందనుకున్న అద్భుతం జరుగుతూంది. చేతిలో ఒక టిన్ను 'ప్లేయర్స్ బాచిలర్స్' వున్నాయి. ఒక సిగరెట్టంటే పదిమంది మనుష్యుల సాయంకన్న యెక్కువగా వుంటుంది! కథ ఆరంభించమన్నాను.

'నేను దేహచ్యుతి పొంది పది సంవత్సరాలైంది. ఇదే స్థలంలో విలపిస్తున్నాను. జీవించిన కాలంలో నేను చిట్టగాంగు వాసిని. పేరు సత్యవాన్. స్టేషనుమాస్టరైన నా తండ్రికి నేనొక్క

దనే కొడుకును. అంచేత తల్లి దండ్రులకు అల్లారు ముద్దుగా పెరిగేను.

'ముద్దుగా పెరిగినవాడనవడంచేత చదువులో కొంచెం వెనకబడి వుండేవాడిని. మెట్రిక్యు ప్యాస్ అయేసరికి నాకు యిరవైయేళ్లు నిండేయి. పైగా చదువుకోవే వుద్దేశం నాకుగాని, చదివించాలని నా తండ్రికిగాని లేకపోవడంచేత నా చదువంతటితో పూర్తి అయింది.

'మాది ధనిక కుటుంబం అనే చెప్పాలి. రైల్వేలో నా కెలాగూ ఉద్యోగం దొరుకుతుంది. కనక ఆ బాధ లేదు. నాకు త్వరగా పెళ్లి చెయ్యాలని నా జనయిత్రి ఆతృత పడుతూండేది.

'నా శరీరం బలిష్టమైనదై, కండరాలు తిరిగి వుక్కుతో చేసినదానివలె వుండేది. నేను అందంగా వుంటానని చుట్టుపక్కలవా రనుకొనేవారు. పూచీలేని జీవితం, మంచి తిండీ, వ్యాయామం కలిసి, మనస్సు పరిణతి చెందకముందే యౌవనం అంకురించి వికసించింది. అంచేత నాకు 'వాంఛ' యింకా జనించలేదు.

'ఇలాంటి పరిస్థితిలో ఒక వింత జరిగింది. నేను రోజుకి రోజూ నీరసించిపోజొచ్చాను. ముందుగా అది నా తల్లి గమనించి భర్తతో చెప్పింది. తండ్రి నాకు వైద్యం చేయించనారంభించేరు. కాని ప్రయోజనం లేకపోయింది. నేను మాత్రం యెప్పుడూ బాధపడి నట్టువుపించేవాడినికాను. జబ్బును గురించి యెవరడిగినా, నాకేమీ తెలీదనేవాడిని, దానికి కారణం లేకపోలేదని నీ కిప్పుడే తెలుస్తుంది.

'ఒకనాడు తెలతెల్లవారుతూండగా, నేను మంచంమీంచి లేస్తూంటే, నాతల్లి ఆశ్చర్యంగా నావద్దకు పరుగెత్తుకొని వచ్చింది. నా మెడలో ఘుమఘుమలాడే పూలమాలిక వున్నది. పంచ రక్తవర్ణ పరిమళోదకంతో తడిసివుంది.

'మొదట నే నవినీతిపరుడనై పోయే ననుకున్నారు బంధువులు, యిరుగు పొరుగువారు. రాత్రిళ్లు దొంగతనంగా విలాసినుల యిళ్ళ కెళుతున్నానని అనుమానించేరు, నన్నెన్ని అడిగినా నాకేమీ తెలీదనేవాడిని. నేను నీరసించిపోతున్నానేగాని, నా కళ్లు అపూర్వంగా వెలుగుతుండేవిట.

'కొన్ని రాత్రులు నన్నెవరో ఒకరు కనిపెడుతూవచ్చేరు. అలాంటప్పుడే విపరీతాలేవీ జరగకపోగానే, నా సౌశీల్యంమీద వారు పెద్ద అనుమానం బలపరచుకున్నారు. నా తండ్రి నన్ను కాపాచినాట్లు పెట్టేరు. తల్లి సిగ్గుతో క్రుంగిపోయింది. నేను మాత్రం ఉలుకే లేదు పలుకే లేదు. కాని నేనే పాపం యెరుగనని చెప్పేవాడిని. కాపలా లేని ప్రతిరాత్రీ ముందు చెప్పిన ప్రకారం పుష్పహాల వసంతాల విపరీతం జరుగుతూండేది.

'ఒకనాటి తెల్లవారుఝామున దేనికో లేచిన నాతండ్రి చూస్తూండగా పడుకొని నిద్రపోతూన్న నా మెడలో వింతగా పూలమాల పడింది. పంచె వసంతంతో తడిసిపోయింది. పరిమళం గుప్పుమంది.

'అతడు నిర్ఘాంతపోయి నన్ను మేలుకొలిపేడు. తిరికి యథాప్రకారం నా అమాయకత్వం వెలిబుచ్చేను.

'అక్కడనుండీ నాకు భూతవైద్యం ప్రారంచేరు. కాని యేమీ ప్రయోజనం లేకపోయింది.'

నేను వూపిరి బిగబట్టి కథ వింటున్నాను. నే నున్నది దెయ్యాల కొంప! మాట్లాడుతూన్నది దెయ్యం! విషయం దెయ్యం! చూడగా చూడగా నేనుకూడా చచ్చిపోయి వొక దెయ్యంగా మారిపోయేనేమో అనిపించింది.

'అయితే యీ పువ్వులూ వసంతం యెలా వచ్చేవి?'

'తొందరపడకు. చెపుతున్నానుగా!'

'ఒకనాటి రాత్రి మామూలుగా నిద్రపోతూన్నాను. ఒక సుందర స్వప్నం వచ్చింది. వర్ణనాతీతమైన వొక దివ్య మంగళ విగ్రహం ప్రత్యక్షం అయింది. మల్లెపూలవంటి తన దంతాలు కొంచెం అగుపించేటట్టు మందహాసం చేసి వయ్యారంగా వ్రేళ్లువంచి రమ్మని సైగచేసింది. ఆ కోమలాంగి క్రీగంటి చూపే నా హృదయంలో నాటుకొన్న ప్రథమ మదన బాణం.

'నేను కలలో లేచి బయలుదేరేను. మృగతృష్ణ వలె ఆ సుందరాంగి నా కగుపించి అందకుండా యెంతో దూరం తీసుకుపోయింది. నడిచి నడిచి యిక్కడికి వచ్చేము. ఇక్కడ, యీ రాత్రి

గట్టుమీద ఆమె వయ్యారంగా కూచొని, మోకాలిమీద మోచెయ్యి, బుగ్గమీద అరచెయ్యి ఆనించి వంకర ముఖంతో, కొంటె చిరునవ్వుతో నన్ను రమ్మని తిరిగి సైగచేసింది. నేను భయాశ్చర్య విభ్రమాలతో వచ్చి ఆమెకు కొంచెం దూరంగా కూచున్నాను. దగ్గరగా రమ్మంది.

'నువ్వెవరు?'

ఆమె విరగబడి నవ్వింది. ఆ నవ్వుకి చుట్టుపట్ల చెట్లమీద నిద్రపోతూన్న శకుంత సంతానం లేచి కలవర పడింది. నిశ్శబ్ద రమణీయ చంద్రికా రాత్రిలో స్త్రీణ సౌందర్యం రూపుగొన్న ఆ బంగారు బొమ్మను రెప్ప వాల్చక చూస్తూ కూర్చుండి పోయేను. ఆమె మెల్లగా నా వద్దకు వచ్చి, చుబుకం పట్టి యెత్తి, గులాబి రేకుల వంటి తన పెదవులతో నా పెదవులపై తేలికగా ముద్దు పెట్టుకొంది. నా శరీరం జలదరించింది.

ఆమెతోటి బ్రహ్మానంద సౌఖ్యం అనుభవిస్తూంటే కాలం తెలియలేదు. తొలికోడి కుయ్యగానే ఆమె నన్ను మా యిల్లు చేర్చింది. నన్ను వీడి వెళ్ళిపోయేటప్పుడు నామెడలో ఒక పువ్వుమాల వేసి బంగారు కలశంతో పట్టుక వచ్చిన పరిమళ వసంతం నా మీద దిమ్మరించింది. ఇది ఆమెకు పరిపాటి అయిపోయింది.

ఇప్పుడు నువ్వు పాడిన పాట ఆమె రోజూ పాడు తూండేది. అది వినకుండా వొక్కరోజూ వుండలేక పోయే వాడిని. ఆ పాట నా జీవితానికి, తరవాత నా ఆత్మ శాంతికి వొక ముఖ్యావసరం అయిపోయింది.

ఒకనాడు ఆమె తన రహస్యం యిలా చెప్పింది.

'నా పేరు కుముద్వతి. నేను పూర్వజన్మలో నీ భార్యను, నువ్వు చిన్న తనంలోనే మృతి పొందడంవల్ల నా జీవితం అడివి గాచిన వెన్నెలైంది. నేనా దుర్భర జీవితాన్ని చాలాకాలం గడిపేను. ఈలోపున నువ్వు మళ్ళీ జన్మమెత్తేవు. నువ్విలా మానవ రూపంలో వున్నంతకాలం స్వప్న సౌఖ్యంతో సంతృప్తి పడవలసిందే. కాని కొన్నాళ్ళకి నువ్వు నా దగ్గరకి వచ్చేస్తావు. ఈ రహస్యం యెవరితోనూ చెప్పకూడదు. చెప్పిన తక్షణం నిన్ను విడిచి పెడతాను.' ఇది ఆమె కథ.

'కుముద్వతి! కుముద్వతి! ఎంత హాయిఅయిన పేరు. ఆపేరు యెంత కఠోరకంఠంతో ఉచ్చరించినా వీణ మీటినట్టుంటుంది. ఆ రహస్యం యెవరితోనూ చెప్పనని వాగ్దానం చేసేను.

'కాని నేను నానాటికీ చిక్కిపోవడం మాత్రం నిజం. మావాళ్లు ఏలోపతీ, ఆయుర్వేదం, హోమియో, యునానీ మొదలైన అన్ని వైద్యాలూ చేయించేరు. చివరకు భూతవైద్యం కూడా చేయించేరు. మాంత్రికుడు యింట్లో పట్లువేసి, దీపాలు వెలిగించి, హుం, హుం' ఫట్, హ్రైం, హ్రీం, అని అట్టహాసం చేస్తూంటే 'కుమి' దూరంగా నిలబడి నవ్వుతూండేది. ఇదంతా నాకొక నాటకంలా వుండేది. ఇవేమీ వద్దని, నాకే జబ్బూ లేదనీ నా తండ్రితో యెన్నోసారులు చెప్పేను. కాని ఆయన నా మాటలు చెవిని పెట్టలేదు.

చివరకి పెళ్లిచేస్తే యిలాంటి బాధలన్నీ పోతాయని యెవరో చెప్పేరు. నన్ను పెళ్లి చేసుకోమని మావాళ్లు బలవంతపెట్టేరు. వాళ్ల పోరు భరించరానిదయింది. ప్రాణంపోయినా నేను పెళ్లిచేసుకోనన్నాను. కాని వారు వింటారా? నయానా చేసుకోకపోతే బలవంతంగా చేస్తామని పట్టుపట్టేరు.

తెల్లవారితే నా పెళ్లిఅనగా ఆరాత్రి కుమితో యీవిషయం చెప్పేను. ఆమె ధనుష్టంకారం విన్న లేడివలె హడలి పోయింది. కంటికీ మంటికీ యేకధారగా యేడ్చింది. నేనూ వెక్కి వెక్కి యేడ్చేను. చివరకు ఆమె హృదయం రాయి చేసుకుంది. నన్ను వడిలోకి తీసుకొని 'సత్యవాన్! నువ్వు పెళ్లి చేసుకో. తప్పకుండా రేపే చేసుకో. నీకోసం నేను రెండుసంవత్సరాలు వేచివుంటాను. రెండు సంవత్సరాలూ నాసవతి పచ్చదనం వోరుస్తాను. నీకువొక కూతురుపుడుతుంది. దానికి నా పేరు పెట్టు. ఏడేళ్లు గడిచిన తరవాత నిన్ను నాదగ్గరకి శాశ్వతంగా తీసుకుంటాను.'

'కుముద్వతి ఆరాత్రి నన్నానందడోలికలో తేలియాడించింది. జీవించిన యేమనిషీ అంత సుఖపడివుండడు.

'కోడికుయ్యగానే బరువైన గుండెతో, రెండేళ్ల యెడబాటు తాపాను కలతపెట్టే మన

స్సుతో యింటికి మరలేను. కుమి నాతో రాలేదు.

'నాకు వివాహమయింది. ఒక కూతురు పుట్టింది. అది మూడుమూర్తులా కుమివలె వుంది. దానికి 'కుముద్వతి' అని పేరుపెట్టేను.

'కుమి పుట్టినవెంటనే నాకు క్షయ జబ్బు వచ్చింది. అది త్వరత్వరగా యెక్కువైంది. కుముద్వతి తన వాగ్దానం నెరవేరుస్తూంది అనుకొని సంతోషించేను. ఇక కొద్దిరోజుల కంటె యెక్కువ బ్రతకనని 'షిల్లాంగు' తీసుకువెళ్లమని డాక్టర్లు మా తండ్రికి సలహా యిచ్చేరు. ఆ ప్రకారం నన్ను షిల్లాంగు తీసుకెళ్లేరు.

'వేచి వేచి మృత్యువుకోసం కళ్లు కాయలు కాచిపోయేయి. చివరకు 'కుమి' చెప్పినట్టు వివాహమైన రెండేళ్ళనాడు నేను మరణించేను.'

అని సత్యవాన్ వూరుకున్నాడు. నాకు అశ్రుత వుబికిపోయింది.

'కుముద్వతిని కలుసుకున్నావా ?'

అతడు వెక్కి వెక్కి యేడ్చేడు పసిపాపవలె.

'అంత అదృష్టమా! బంధన విముక్తి పొందిన తక్షణం గాలికన్న వేగంగా వచ్చి యిక్కడ వాలేను. కుమి కనుపించలేదు. వెఱ్ఱిగా ప్రపంచావధులు. కాలావధులు అధిగమించి వెతికేను. కాని కుమి అగుపించలేదు.

మీ యెడబాటు కాలంలో కుమి ఆత్మ ఘోర తపస్సుచేసి పరమాత్మలో లీనమయి వుండాలి.'

నిజం అన్నట్టు అప్పుడే క్రింద పల్లెలో తొలి కోడి కూసింది.

దేహరహితుడైన సత్యవాన్ దగ్గర శలవుతీసుకొన్నాను.

అతడు అవనత వదనంతో, హృదయ భారంతో, అశ్రువులతో తన యథాస్థలం వేపు రెండడుగులు వేసి తిరిగి 'బాబూజీ! మళ్లీ యెన్నాళ్లకి వస్తాడో నీవంటి పుణ్యాత్ముడు! తిరిగి నా కెప్పుడు బాధోప శమనం కలుగుతుందో!' అన్నాడు.

నాకు నోట మాట రాలేదు.


మీ బిడ్డకు జబ్బు కారణమేమి ?



మీ బిడ్డ మాంద్యముగా నుండుటకుగల మూలకారణము తప్పక తెలుసుకోండి. చికిత్సపిమ్మటకూడా బాధకరమైన వ్యాధి లక్షణములు పట్టి విడువకున్నా, లేక తిరుగబెట్టినా, అది లివర్ వ్యాధి కారణమై యుండవచ్చును. దాన్ని సరియైన వైద్యసహాయముచే నివారించవలయును.

ఆహారమందయిష్టము - సోమరిగాయుండుట - చిరచిరలాడుట, మలబద్ధకము లేక అతి విరేచనములు - వాంతులు - కడుపుబ్బరము లేక కాక - స్వల్పజ్వరము - బరువుతగ్గిపోవుట.

గాంధీనగర్, విజయవాడ • రాజాబజార్ విజయనగరము.

ఇతరవైద్యశాలలు :- బొంబాయి నాగపూరు • లక్నో • కలకత్తా తిరిచిరాపల్లి • కుంబకోణము బెంగుళూరు.

జమ్మివారి

లివర్‌క్యూర్

లివర్ స్ప్లీన్ వ్యాధులకు నిరోధనకుగూడా సహాయపడును అన్నిమందుల షాపుల్లోదొరకును.

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్సు,
2, బ్రాడీస్ రోడ్డు, మైలాపూర్, మదరాసు.

SISTAS-J-280-Telugu